## అడెల్లి పోచమ్మ ఆలయంలో బోనాల సమర్పణ



బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

కుభీర్, మే 26: నిర్మల్ జిల్లా కుభీర్ శివారులోని అడెల్లి పోచమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ఇటీవల ఆలయాన్ని విరాళాలతో పునర్నిర్మించారు. ఆయా గల్లీలకు చెందిన మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోగుల బాబు, శంకర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

లోకేశ్వరం, మే 26 : పంచగుడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి వైర్లను దొంగలించారు. ఈ విషయం తెలుసుకున్న మామిడి గంగవ్వ విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు.

## బాధితురాలికి పరామర్శ

బోథ్, మే 26 : మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన చిన్న బుజ్జవ్వ పాటు కాటుకు గురైంది. ఆదివారం మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ బోథ్ దవాఖానకు వెళ్లి బుజ్జవ్వను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సాయినగర్ కాలనీలో పర్యటించారు. చెత్తాచెదారం తొలగించాలన్నారు. పాముల బెడద లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

# విత్తనాల ఎంపికలో జర జాగ్రత్త

- మొదలు కానున్న వానకాలం సీజన్
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



నార్నూర్‌లో ఎరువుల, విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నార్నూర్/బజార్‌హత్నూర్, మే 26 : వానకాలం పంటల సాగు సీజన్ త్వరలోనే మొదలుకానుంది. రైతులు ఎరువులు, విత్తనాలు సమాకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పలు విత్తన, పురుగుల మందుల కంపెనీల ప్రచారం ఊపందుకుంది. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే నష్టపోయే అవకాశాలు లేకపోలేదు.

### సాగు అంచనా...

నార్నూర్, గాదిగూడ, బజార్‌హత్నూర్ మండలాల్లో వానకాలంలో సుమారు 114 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా 83వేల ఎకరాల్లో పత్తి సాగు ఉంటుందని ప్రణాళిక రూపొందించారు. పత్తి సాగులో అధికంగా రైతులు బీజీ–2 విత్తనాలు ఎంచుకుంటున్నారు. మండలాల్లో గుర్తింపు పొందిన ఎరువుల, విత్తనాలు, పురుగు మందుల ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

### వ్యవసాయ అధికారుల సూచనలు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు ఇలా...

- ★ వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- ★ బిల్లుపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చేసుకోవాలి.
- ★ గడువు దాటిన విత్తనాలు, మందుల ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలు కొనుగోలు చేయవద్దు.
- ★ విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలి.

### పురుగుల మందు ఎంపిక ఇలా...

- ♦ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పురుగు మందులు కొనుగోలు చేయాలి.
- ♦ లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- ♦ పురుగుల మందు డబ్బాలపై చక్రపు ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- ♦ పురుగుల మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చిపెట్టాలి.

### ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు..

- ➲ లైసెన్స్ కలిగి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి. బిల్లులను ,ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి.
- ➲ మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒకవేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చేసుకోవాలి.
- ➲ నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహాయంతో ఎరువులను పరీక్షలకు పంపాలి.

### కల్తీలను గుర్తించడం ఇలా...

- ➲ యూరియా, క్యాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి. ఎరువులు ఇసుక రేణువుల రూపంలో పోటాష్ సూపర్ ఫాస్పెట్ పొడి రూపంలో ఉంటాయి.
- ➲ ఒక చెంచా యూరియా ఐదు మిల్లీ లీటర్ల పరిశుభ్రమైన నీటితో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశముంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.

### గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి



రైతులు విత్తనాలను గుర్తింపు పొందిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి. బీజీ–2 విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. బీజీ–3 పేరుతో నకిలీ విత్తనాలు, నిషేధిత విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దు.

-గిత్తే రమేశ్, వ్యవసాయ అధికారి, నార్నూర్

### నకిలీ విత్తనాల జోలికి పోవద్దు



మార్కెట్‌లో తక్కువ ధరకు ఉన్నాయని దిగుబడి బాగా వస్తుందని మాయమాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం దగ్గరగా ఉండడంతో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చే అవకాశం కలదు కావున రైతులు జాగ్రత్తగా ఉండాలి. నకిలీ విత్తనాలు ఎక్కడైన అమ్మినట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు సమాచారం అందించాలి. అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

-ప్రమోద్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, బజార్‌హత్నూర్

## పెరిగిన వేతనాలు వెంటనే అమలు చేయాలి

ఎదులాపురం, మే 26 : బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు మే 1 నుంచి అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని కుమ్రం భీం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ద్వారా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ నోటీలు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. దీని ఫలితంగానే హైదరాబాద్‌లోని కొంపల్లిలోని ప్రైవేట్ హోటల్ జరిగిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు. బీడీ ప్యాకర్లకు ప్రతి నెలా రూ.3650 ఉద్యోగులకు రూ.1700 చొప్పున వేతనలు పెరిగాయని తెలిపారు. సమావేశంలో నాయకులు గౌరాల సుభాష్, అశోక్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ టౌన్, మే 26 : బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాల, చాటర్స్, పిల్లర్లకు పెరిగిన వేతనాలు మే 1వ తేదీ నుంచి అమలు చేయాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికుల ఐక్యత ఫలితంగానే యాజమాన్యాలు వేతనాలు పెంచడం జరిగిందన్నారు. పెరిగిన వేతనాలు మే 1వ తేదీ 2024 నుంచి 30వ తేది సెప్టెంబర్ 2026 వరకు అమలులో ఉంటాయన్నారు. ఈ పెంపు వల్ల దాదాపు 7లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, మద్దినేని చిన్న రాజన్న పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరేశ్

భైంసాటౌన్, మే 26 : వానల్‌పాడ్ గ్రామంలో అరుష్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. తాలూకాలో మరిన్ని చోట్ల ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ బండెల నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్ పాటిల్, రాంకుమార్, ఉపసర్పంచ్ ఈశ్వర్, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన చెరువుకు మంటలు.. తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పివేస్తున్న గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది

భైంసాటౌన్, మే 26 : ఇలేగాంలో గ్రామానికి అనుకొని ఉన్న చెరువు ఎండిపోయింది. ఆదివారం అందులో ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలకు నిప్పంటుకొని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చెరువుకు అనుకొని ఉన్న ఇండ్లకు మంటలు అంటుకుంటాయేమోనని గ్రామస్తులు భయాందోళన చెందారు. వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి వారు చేరుకొని గ్రామస్తుల సహాయంతో మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

# గాండ్ల సంఘం బలోపేతానికి కృషి



సమావేశానికి హాజరైన నాయకులు

ఎదులాపురం, మే 26 : గాండ్ల సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని, ఆదిలాబాద్ జిల్లా కమిటీకి ఎల్లవేళలా అండగా ఉంటామని సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులు భరోసా కల్పించారు. ఎటువంటి సమస్యలు తలెత్తిన వాటి పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఆదివారం గాండ్ల సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నందవార్ రాజేశ్వర్, తమ్మలవార్ చందు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమనగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీహరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, లీగల్ అడ్వాయిజర్ కమిటీ చైర్మన్ వీరసుందరం, కమిటీ సభ్యులు శ్రీధర్ హాజరయ్యారు. జిల్లా సంఘం బాధ్యులు బాంధవులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. గాండ్ల సంఘం బలోపేతం కావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్

నార్నూర్, మే 26 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో అన్ని వర్గాల కమిటీ పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, ఆటో డ్రైవర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం పేరుతో ఘర్షణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా మెలగాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. సమస్యలు నిర్భయంగా పోలీస్ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తమవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారస్తులు దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలను కట్టడి చేయడానికి సులభతరంగా ఉంటుందన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో నార్నూర్ సీఐ రహీంపాషా, ఎస్ఐ మహేశ్ పాల్గొన్నారు.

# నిర్మల్ కవికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవి వెంకట్

నిర్మల్ టౌన్, మే 26: నిర్మల్‌కు చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు వెంకట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో 134వ అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనంలో పురస్కారాన్ని అందుకున్నారు. కవి సమ్మేళనంలో వెంకట్ అత్యుత్తమ కవితాగానం చేసినందుకు తాళపత్ర పూర్వ పరిశోధకులు శ్రీనివాసరావు, పద్యకవి నర్సింహమూర్తి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. వెంకట్‌ను పలువురు కవులు, కళాకారులు అభినందించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



బోథ్: విత్తన ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న సీఐ రమేశ్

బోథ్, మే 26 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేశ్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందని కంపెనీల విత్తనాలు విక్రయించొద్దన్నారు. విత్తనాలు విక్రయించిన తర్వాత రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. రసీదుపై రైతు సంతకం, తేదీ, ప్యాకెట్ల వివరాలు రాయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ రాము, సిబ్బంది ఉన్నారు.



ఇంద్రవెల్లి: విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ దుబ్బాక సునీల్

ఇంద్రవెల్లి, మే 26: మండలంలోని ముత్నూర్, ధనోరా(బీ) గ్రామాల్లోని విత్తనాల, ఎరువుల దుకాణాలను ఆదివారం ఎస్ఐ సునీల్ తనిఖీ చేశారు. విత్తనాలతో పాటు ఎరువులకు సంబంధించిన వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న దేవుని ఆలయంలో చోరీ

లోకేశ్వరం, మే 26 : హద్‌గాం గ్రామంలోని మల్లన్న దేవుని ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. దుండగులు ఆలయం తలుపులు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలు చూసి గ్రామస్తులకు తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు.

## గజ్జలమ్మకు పూజలు



లోలం శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల, మే 26 : మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమితి సభ్యులు ఆయనను సన్మానించారు. ఆయన వెంట వాసవి కళాశాల ప్రిన్సిపాల్ సాయిలు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ పైలెట్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న పైలెట్లు

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ పైలెట్ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 108 జిల్లా మేనేజర్ బాదవత్ తిరుపతి, అంబులెన్స్ సిబ్బంది కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది ఎండీ వజీం, విఠల్ గౌడ్, సత్యానారాయణ, ముజాఫర్, వినోద్, పాండురంగ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

సోన్, మే 26 : బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మి(33) దవాఖానలో చికత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. వివరాలకు వెళ్లితే... బద్దం లక్ష్మి భర్త రాజు మాట వినకుండా తోటకు పనికి రావడం లేదని భర్తపై కోపంతో ఈ 22వ తేదీన మధ్యాహ్నం సమయంలో తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను దవాఖానకు తరలించారు. నాలుగు రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

## మేకల కాపరికి వెళ్లి అదృశ్యం



మేకల భీమన్న (ఫైల్)

పెంబి, మే 26 : మేకల కాపరికి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని ఇటిక్యాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. ఇటిక్యాల గ్రామానికి చెందిన మేకల భీమన్న (42) శనివారం ఉదయం మేకల మందను తీసుకొని అడవిలో మేపడానికి వెళ్లాడు. మేకల కాపరికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అడవిలో వేతికన దొరకలేదు. ఆదివారం అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా జమదగ్ని మహర్షి రేణుకా మాత కల్యాణ మహోత్సవం

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్‌లోని సాయినగర్ కాలనీలో ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం జమదగ్ని మహర్షి రేణుక మాత కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. వేద పండితులు ఫణతుల ప్రవీణ శర్మ బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు నెమలికొండ బాలు శర్మ, ఆదిలాబాద్ గీతా కార్మిక సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## రాజశ్యామల మహాయాగం ప్రారంభం

ఎదులాపురం, మే 26 : లోక కల్యాణార్థం ఆదిలాబాద్‌లోని ప్రగతి విద్యాలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం రాజశ్యామల మహాయాగం ప్రారంభమైంది. యాగంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నట్లు తెలిపారు. యాగం నిర్వాహకుడు ఆదినాథ్, ఆయన కుమారుడు వేదవ్యాస్ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

## అన్నదాన సత్రానికి విరాళం



విరాళం అందిస్తున్న చాత మున్నూరుకాపు సంఘం సభ్యులు

కుభీర్, మే 26 : బాసరలో నిర్మించనున్న మున్నూరుకాపు వసతి గృహం, అన్నదాన సత్రం నిర్మాణానికి తమ వంతుగా మండలంలోని చాత గ్రామంలోని ఎంకే సంఘం రూ.51వేలు ఆదివారం తాలూకా సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేశ్‌కు సభ్యులు అందజేశారు. గ్రామ సంఘం అధ్యక్షుడు సాయినాథ్, మాజీ ఎంపీటీసీలు ఏశాల విఠల్, లింగేశ్వర్, తాలూకా, మండల, గ్రామ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాదవ్ బలరాం

బోథ్, మే 26: కన్గుట్ట గ్రామానికి చెందిన బీరం రమేశ్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లోకేశ్వరం : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం, మే 26 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1996–97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలు చేసుకొని మధురస్మృతులను నెమరేసుకున్నారు. విద్యా నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో..

భైంసా, మే 26: భైంసాలోని కిసాన్ గల్లిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒకే చోట కలిశారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు. పాఠశాలకు రూ. 20వేల సౌండ్ సిస్టంను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దామోదర్ రెడ్డి, సిరికొండ దామోదర్, రాజేశ్వర్, మహిపాల్, ధర్మపురి సుదర్శన్, నాగభూషణ్, దత్తాత్రి, నితిన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజన్న పాల్గొన్నారు.

### న్యూ వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నిర్మల్ అర్బన్, మే 26: సోన్ మండలం న్యూ వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం నిర్మల్‌లోని మయూరి హోటల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత విద్యార్థులందరూ ఒకేచోటకి చేరి ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

### బాగులవాడలో..

నిర్మల్ చైన్‌గేట్, మే 26 : నిర్మల్ పట్టణంలోని బాగులవాడ శ్రీ సరస్వతి శిశుమందిర్ 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత రజోత్సవ ఆత్మీయ సమ్మేళనం దివ్యగార్డెన్‌లో నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు.



భైంసా: శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో..



నిర్మల్ అర్బన్: గురువులతో కలిసి సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



నిర్మల్ చైన్‌గేట్: పూర్వ విద్యార్థులతో గురువులు

# ఘనంగా భీమన్న పండుగ



పూజలు చేస్తున్న ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం సభ్యులు

లోకేశ్వరం, మే 26 : కనకాపూర్ గ్రామంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భీమన్న దేవుని పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.